# నడి ఏటిలో నావ

## తురగా (మోచర్ల) జయశ్యామల

ఉరమని పిడుగు పాటులా వచ్చిన రిటైరు మెంటు వార్త, విశ్వనాథం గుండెల్లో బాంబులా పేలిపోయింది.

యింకా ఎన్నేళ్ళ తర్వాతో అనుకున్న మృత్యువు, అప్పుడే వాకిట గుమ్మంలో నిలబడినట్లయింది.

ఆ వార్త విన్నప్పటినుంచి విశ్వనాథానికి అన్నం నీళ్ళు సహించడంలేదు. తన ఆఫీసులో తనుగాక, మరో నలుగురు కూడా రిటైరు కాబోతున్నారు. విశ్వనాథంకి కంటినిండా నిద్ర పట్టడం లేదు. మరో మూడేళ్ళవరకు నిశ్చింతగా వుండొచ్చు... ఈ లోపల ఇంటి సమస్యలు కాస్త ఓ కొలిక్కి వస్తాయనుకుంటున్న విశ్వనాథానికి రిటైరుమెంటు వార్త ఆశనిపాతంలా తగిలింది. యింట్లోను, బయట కూడా కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

రిటైరుమెంటు అవబోతూన్న వారందరూ కూడా 'స్టే' ఆర్డరు కోసం ప్రయత్నంచేసినా ఫలితం దక్కలేదు. తన ఒంట్లో యింకా కష్టించి పనిచేసే శక్తీ, యుక్తీ వున్నా 'నువ్వింక పని చేయనక్కర్లేదు... ఇంక పక్కన కూర్చుని కృష్ణా, రామా! అనుకో అన్నట్లుగా ఇంటికి పంపెయ్యడం విశ్వనాథంకి ఎంతో అవమానంగా, మరెంతో బాధగా అన్పించింది. కాని, ఏం చెయ్యగలడు? ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించ లేడు కదా!

విశ్వనాథం రిటైరు అయ్యాడంటే, అతనే కాదు యింట్లో పెద్దా, చిన్నా సభ్యులందరూ బెంగ పెట్టేసుకున్నారు.

విశ్వనాథం భార్య విశాలాక్షి గర్భకోశానికి సంబంధించిన వ్యాధితో మూడు నెలలుగా మంచంలో వుంది, ట్రీట్‌మెంటు తీసుకుంటూ ఆమెకు గర్భ కోశంలో ఏదో పుండు పడితే, తప్పని సరిగా రెండు నెలల క్రితం ఆపరేషను చేయించాల్సి వచ్చింది. అయితే, ఆ ఆపరేషనప్పుడు కొంచెం డాక్టర్ల అశ్రద్ధవల్ల కుట్లు సరిగా పడలేదు. పడిన వాటికి చీము పట్టి, తిరిగి నానా గొడవా అయింది. దానా, దీనా మూడు నెలలుగా మంచంలోనే వుంది విశాలాక్షి. ఆమె ఆపరేషను కోసం, ట్రీట్‌మెంటు కోసం తన ఎల్.ఐ.సి. పాలసీ మీద లోను తీసుకు వచ్చాడు. నెలకు రెండు మూడొందలు ఆవిడ మందులకు, పళ్ళకు ఖర్చవుతూంది, డాక్టరు బిల్లులు కాకుండా. విశ్వనాథానికి అది అతని స్థితికి మించిన ఖర్చే. అయినా తప్పదు. మిగతా ఖర్చులే తగ్గించు కొని, విశాలాక్షికి ఏలోపమూ లేకుండా చూస్తు న్నాడు విశ్వనాథం.

మూడు సంవత్సరాల క్రితం పెద్దకూతురు చంద్రమతికి ఎనిమిది వేలు కట్నంగా ఇచ్చి, మరో పదివేలు ఖర్చుపెట్టి పెళ్ళిచేసాడు. చంద్ర మతి పెళ్ళికి ప్రావిడెంటు ఫండు నుంచి లోను తీసుకున్నాడు. ఆ లోను రెండు నెలల క్రితమే తీరింది. ఆ ఒక్క పిల్ల బాధ్యత మటుకే తీర్చుకున్నాడు, తనుకన్న సంతానంలో.

రెండోది సుకన్య. 'నా పెళ్ళి ఎప్పుడు చేస్తారే!' అనడుగుతూన్న చూపులలో కంట్లో నలుసులా ఎదిగి కూర్చుంది. సంవత్సరంగా సుకన్య పెళ్ళి చేయాలని చాలా ప్రయత్నిస్తు న్నాడు విశ్వనాథం. రిటైరయ్యేలోపుల సుకన్య పెళ్ళి, పెద్దకొడుకు డిగ్రీ చదువు అయిపోతే, మిగతా ఇద్దరి పిల్లల సంగతి నెమ్మదిగా చూడొచ్చు అనుకున్నాడు.

కాని, ఆశలన్నీ అడియాసలయ్యాయి. యిప్పుడు చేతికి కాస్తో, కూస్తో డబ్బు వచ్చినా అందులో, సంసారమే నడపగలడా! —కన్య పెళ్ళి చెయ్యగలడా! పిల్లలకి చదువులు చెప్పించగలడా! ఏదిదారి!

ఇంకా పెద్దవాడు రాము సెకండియరు బి.కాప్. చదువుతున్నాడు. ఇంకో సంవత్సరం చదువు పూర్తి చేసుకుంటేనేగాని ఉద్యోగ ప్రయత్నంలో పడడానికి వీలులేదు. ప్రయత్నంలో పడ్డాక ఎన్నేళ్ళకి ఉద్యోగం వస్తుందో అంతకంటే తెలియదు.

రెండో వాడు శీను. ఈ సంవత్సరం టెంతు పరీక్షలు రాస్తాడు. తరువాత వాడు యింకా ఎయిత్ స్టాండర్డులో వున్నాడు. వీళ్ళ చదువులు ఎప్పటికి...ఎలా...పూర్తయి ఒక దారిన పడగలరు విశ్వనాథంకి అంతా అయోమయంగా వుంది.

ఇన్నేళ్ళ సర్వీసుకాలంలో వెనుకేసుకున్నది ఏమీ ఏమీ లేనేలేదు. నెలజీతం తెచ్చుకున్నది తెచ్చుకున్నట్లుగా ఖర్చుపెట్టినా సరిపోయేది కాదు. విశాలాక్షి చాలా పొదుపరి మనిషి కావడం వల్ల, ఎక్కడ అప్పులు, సొప్పులు లేకుండా గుట్టుగా సంసారం సాగిస్తూంది గాబట్టి, సంసారం వీధిన పడడంలేదు.

* * * *

ఆ రోజు ఉదయమే, ప్రతినెల మొదటి వారంలో వచ్చేట్లుగానే, ఇంటాయన శ్రీపాదం గారు, అద్దె వసూలు చేసుకెళ్ళడానికివచ్చారు.

ఆయన వస్తూనే, 'ఏమండీ, విశ్వనాథం గారూ!! మీరు రిటైరయ్యారుట నిజమేనా?' అనడిగాడు.

'అవునండి...?' ఆమాట అనడానికి చాలా బాధపడ్డాడు విశ్వనాథం.

'అసలు నన్నడిగితే ఇదిమంచి నిర్ణయమే లెండి... పెద్దవాళ్ళు కాస్త పక్కకు తప్పుకుంటే ఉద్యోగాలు లేక నిరుత్సాహ పడిపోయి, నిర్వీర్యమైపోతున్న యువకులకు కొన్ని ఉద్యోగాలు దొరుకుతాయి...

శ్రీపాదంగారి మాటలకు విశ్వనాథం మనసులో మండింది. 'ఒకరి కడుపుకొట్టి యింకొకరికి పెట్టడం గొప్పటండీ... చేతనయితే వారికి కొత్త ఉపాధి కల్పించాలిగాని?' అనాలనుకున్నాడు గాని, పైకనలేక పోయాడు విశ్వనాథం. శ్రీపాదంగారికేమిటి? ఆయనలా కడుపులో చల్ల కదలకుండా వుంటే, ఎన్నికబుర్లయినా చెప్పొచ్చు. ఆయనగారు ఉద్యోగం చేసేకాలంలో రెండు చేతులా ఆర్జించాడు. యిప్పుడేమన్నా తీర్చుకోవలసిన బాధ్యతలున్నాయా? ఏమన్నానా? వున్న ఒక్కగానొక్క కొడుకూ ఇంజనీరుగా రూర్కెలాలో వుంటున్నాడు. ఈయనగారు ఈ ఊళ్ళోనే అగ్గిపెట్టెల్లాంటి గదులలో అక్కడక్కడ నాలు గిళ్ళు కట్టి, తనలాంటి వాళ్ళకి అద్దెలకిచ్చాడు. అద్దెలమీదే ఆయనకు నెలకు పదిహేను వందలు వరకు వస్తుంది. అదీగాక ప్రతీనెలా వచ్చే పెన్షను. నాలుగు సంవత్సరాల క్రితం భార్య కూడా పోయింది. కొడుకు, కోడలు ఎక్కడో వుంటే ఈయనగారు మాత్రం, ఈ ఊరు వదిలి పెట్టకుండా, ఇక్కడే కాలం గడుపు తున్నాడు. వయసు అరవై దాటుతున్నా, ఎప్పుడూ నలగని బట్టలతో, చెరగని నవ్వుతో పూలరంగడులా వుంటాడు. అటువంటి వాడికి నడిసముద్రంలో నావలా అయిపోయిన తన బాధేం తెలుస్తుంది. తీర్చుకోవల్సిన బాధ్యతలు ఎన్నివుండి పోయాయో ఆయనకేం అర్థమవు తుంది? అనుకున్నాడు విశ్వనాథం, పైకిమాత్రం ఏమీ మాట్లాడలేదు.

శ్రీపాదం కాసేపు ఆమాటా, ఈమాటా మాట్లాడి 'అద్దె ఇచ్చేస్తారా!' అన్నట్లు చూసాడు.

ఆచూపునర్థం చేసుకొన్న విశ్వనాథం చూడండి, శ్రీపాదంగారూ! మీకింతవరకు ఏ ఒక్క నెల నేను బాకీ పెట్ట లేదు. అలా నాకిష్టం లేదుకూడా! ముందు మీ సంగతి చూసాకే, మిగతా పనులు చూస్తున్నాను. కాని, ఈ ఒక్క నెల కొంచెం ఆగండి. చేతికింకా డబ్బు అందలేదు. రాగానే మీకు ఇచ్చేస్తాను ' అన్నాడు.

'ఇవాళా! నిన్ననా! పది సంవత్సరాల పరిచయం. ఈ పది సంవత్సరాలలో విశ్వనాథం చెప్పినట్లు ఏ ఒక్కనెల ఆలస్యంగాని, బాకీగాని లేకుండా యిచ్చాడు. అందువల్ల అంత నిర్మొహమాటంగా కాదనలేకపోయాడు శ్రీపాదంగారు.

'అలాగే కానివ్వండి, విశ్వనాథంగారూ! మీ దగ్గర డబ్బు ఎక్కడికి పోతుంది. కాకపోతే ఒకమాట చెబుతాను... ఏమీ అనుకోరు కదా?' అన్నాడు.

'ఏమిటో చెప్పండి?' అన్నట్లుగా చూసాడు విశ్వనాథం.

'అదికాదు... పరిస్థితి ఇదివరకటిది కాదాయె. అనుకోకుండా ముందే రిటైరయి పోయారు. ఇదివరకటిలా అంత జీతం రాక పోయినా, ఖర్చులు తప్పవుకదా? ఇటువంటి సమయంలో ఇంత మొత్తం ఇంటి అద్దెగా నెల నెలా ఇవ్వాలన్నా మీకూ కష్టమే. కాస్త చిన్న ఇల్లు చూసుకుంటే, అద్దె తక్కువ అవుతుంది. మీకూ కొంచెం ఖర్చు తక్కువ అవుతుంది. ఇలా అన్నానని ఏమీ అనుకోకండి. నాకుతోచిన సలహా నేను చెప్పాను. మీరూ ఒకసారి ఆలోచించండి అంటూనే శ్రీపాదం కదిలి పోయాడు.

ఆయన వెళ్ళిపోయినా, ఆయన మాటలే ఆలోచిస్తూ కూర్చున్నాడు విశ్వనాథం. 'ఇక ముందు ఇంత అద్దెఇవ్వలేవు... నీ ఉద్యోగం పోయిందిగా... అందుకని ఇల్లు ఖాళీచెయ్యి?' అన్న గూఢార్థం ఆయన మాటల్లో వుందని అర్థమవుతూనేవుంది.

ఇన్నేళ్ళు పరిచయంలో కూడా అంత నిర్మొహమాటంగా శ్రీపాదం అలా చెప్పి పోయాడంటే, అతనికి తనమీద గౌరవం పోయిందా? రిటైరయిపోయేసరికి చులకన అయిపోయాడా?

* * *

మరో రెండు రోజులు గడిచాయి. ఆ రెండు రోజులుగా రాము కాలేజీకి వెళ్ళకుండాఇంట్లోనే కూర్చోవడం గమనించాడు విశ్వనాథం.

'ఏం? కాలేజీకి వెళ్ళలేదు... సెలవులా!' అనడిగాడు.

'ఉహూ...?'అన్నాడు అడ్డంగా తలూపుతూ రాము.

'మరి...?'

'ఏంలేదు...ఇంక చదువు మానేద్దామనుకుంటున్నాను... ఏదోఒకటి ఉద్యోగం చూసుకోవాలనుకుంటున్నాను?'

రాము మాటలకి విశ్వనాథం ముందర ఆశ్చర్య పోయాడు. తర్వాత బాధపడ్డాడు.

'ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నావ్!' అడిగాడు.

'అవును, నాన్నా! ఇంకేం చేయాలో తోచడంలేదు. మీరేమో రిటైరయిపోయారు. ఇంకో ఏడు చదివి బి.కాప్. కంప్లీట్ చేసినా ఒకటే... చేయక పోయినా ఒకటే... ఇప్పటినుంచి ప్రయత్నిస్తే, కొన్నేళ్ళకయినా ఉద్యోగం వస్తుందని...? నిరాశగా అంటూన్న

**విశ్వనాధానికి చాలా కోపంగా వుంది. పాలవాడు...పచారీ కొట్టువాడు...అందరు...అందరిమీదా కోపంగా వుంది. వీళ్ళందరూ తననేమనుకుంటున్నారు? రిటైరయిపోయాను కాబట్టి, ఇంక నెల సరిగా వారిడబ్బు వారికివ్వలేననుకుంటున్నారా! రిటైరయేసరికి వీళ్ళందరికి తనంత అసమర్థతగా కన్పిస్తున్నాడా! అనుకున్నాడు. విశాలాక్షి మాటలు గుర్తుకు వచ్చాయి.**

కొడుకు ముఖంలోకి చూడ లేక పోయాడు విశ్వనాథం.

'వద్దు, రామూ ఎలాగో కష్టపడి ఈ ఒక్క సంవత్సరం చదివావంటే ఓ డిగ్రీ కాగితం చేతిలోకి వస్తుంది. ఆ కాగితం ముక్క చేతిలో వుంటేనే కదా ఎప్పటికయినా ఉద్యోగంటూ వచ్చేది. నాకు పెన్షను వస్తుంది.

ఈ పెద్ద ఇంట్లోంచి రెండు గదులున్న ఓ చిన్న ఇల్లు చూసుకొని మారిపోదాం. కాస్త అద్దె తక్కువ వుతుంది... ఎలగో కష్టాలు పడాలి... ఎలాగో సర్దుకోవాలి. చదువు మానతానంటావేమిటి...?

రాము మరేమీ మాట్లాడ లేక పోయాడు కాని, అతని మనసు చేదు తిన్నట్టుగా అయి పోయింది.

'అమ్మా! సుబ్బిశెట్టి సరుకులు ఇయ్యనన్నాడే?' కిరాణా దుకాణంకి సరుకుల కోసంవెళ్ళిన శీను ఖాళీ సంచీ వూపుకుంటూ వచ్చాడు. 'ఏం? ఎందుకనిరా?' మంచం మీద కూర్చు న్న విశాలాక్షి నీర్సంగా అడిగింది.

'మీ నాన్నగారు రిటైరయి పోయారు కదు, బాబూ? ఇంక నెలసరిగా సరుకులు అరువుపద్దులో యివ్వలేను. ఎప్పటి డబ్బులు అప్పుడు యిచ్చి సరుకులు తీసుకెళ్లండి' అన్నాడమ్మా ' శీను ముఖం ఆ(స్పోబిళ్లంత చేసుకొని అన్నాడు.
విశాలాక్షి గట్టిగా నిట్టూర్చింది.

శీను మాటలకి అక్కడే వున్న విశ్వనాథం కి కోపం వచ్చింది. 'ఏం? వాడి డబ్బేమయినా ఎగవేసి పారిపోతాం అనుకున్నాడా? పదేళ్ళ నుంచి సరుకులు ఇస్తున్నాడు.... ఆ మాత్రం నమ్మకం, విశ్వాసం లేవూ?' అనరిచాడుగట్టిగా.

'వాడిననుకొని ఏం లాభం. వాళ్ళభయం వాళ్ళకుంటుంది. ఖచ్చితంగా ఒకటో తారీఖు కి ఇంత అని జీతం వస్తే, ఎవరిది వాళ్ళకిచ్చే వాళ్ళం ఇప్పుడింక డబ్బు మనచేతికెంత వస్తుందో... ఎప్పుడు వస్తుంతో తెలియదు. అది వాళ్ళు మాత్రం ఆలోచించుకోరా, ఏమిటి!' అంది విశాలాక్షి సన్నని గొంతుకతో.

భార్య మాటలకు విశ్వనాథం ఏమి మాట్లాడ లేదు. ఆరోజు ఉదయం పాలుపోసేవాడు 'నెల కొక్కసారే ఇస్తేయింక ముందు కుదరదు బాబయ్యా? ఏ రోజు డబ్బులు ఆరోజే యివ్వండి అని అన్నాడు.

విశ్వనాథానికి చాలా కోపంగా వుంది, పాలవాడు.... పచారీ కొట్టువాడు.... అందరు... అందరి మీదా కోపంగా వుంది. వీల్ళందరూ తన నేమనుకుంటున్నారు. రిటైరయి పోయాను కాబట్టే ఇంకనెల సరిగా వారి డబ్బు వారికివ్వలేనను కుంటున్నారా? రిటైరయేసరికి వీళ్ళందరికి తనంత అసమర్థతగా కన్పిస్తున్నాడా? అనుకున్నాడు. ఆ వెంటనే విశాలాక్షి మాటలు కూడా గుర్తుకు వచ్చాయి. ఒకటో తారీఖు వచ్చేసరికి ఖచ్చితంగా నెల జీతం చేతికందే సరికి ఎవరి డబ్బు వాళ్ళకిచ్చేసి, చేతులు దులిపేసుకొని, మళ్ళీ ఒకటో తారీఖు వచ్చేవరకు నిశ్చింతగా వుండేవాడు. మరి ఇక ముందు అలాకాదు కదా?



'చూడు, రంగయ్యా? ఇంక ఈ నెల నుంచి నువ్వు రానక్కర్లేదు. మానెయ్యి.' చాకలి తెచ్చిన బట్టలుపద్దు చూడడం అయ్యాక అంది —కన్య.

'ఎందుకమ్మా?' అనడిగాడు ఆశ్చర్యంగా చూస్తూ చాకలి రంగయ్య.

'ఏంలేదు, రంగయ్యా? బట్టలు చాలా తక్కువ పడుతున్నాయి కదా? ఇక ముందు ఇంట్లోనే వుతికేసుకోవవచ్చునని...?' అంటూ నసిగింది —కన్య.

రంగయ్య ఇక మాట్లాడ లేక పోయాడు.
'అమ్మగారూ... ఇన్నేళ్ళాయి మీ ఇంట్లో పని చేస్తుండాను.... ఎన్నడయినా డబ్బుకోసం.... మిమ్మల్ని బాధించినానా! కన్నీళ్ళతో అడిగింది లచ్చి.

విశాలాక్షి బాధగా చూసింది దానివంక. అలాని నేనన్నానా లచ్చీ? ఇప్పుడు నా ఆరోగ్యం కూడా కొంచెం బాగానేవుంది. ఇంట్లో ఇద్దరాడ వాళ్ళం వున్నాం... చూసుకొంటాం. అంతే!| అంది విశాలాక్షి.

లచ్చి ఆ యింట్లో అయిదేళ్లుగా పని చేస్తూంది. లచ్చిని పని మానెయ్యమని చెప్పడం విశాలాక్షికి చాలా బాధగానే వుంది. మరి నెలకి లచ్చికిచ్చే యాభయిరూపాయ లుంటే, ఇంకో ముఖ్యమైన ఖర్చుకి కలిసి వస్తుందికదా? ఈ చిన్న చిన్న ఖర్చులను ఎలాగయినా సర్దుకుపోవచ్చు. కానీ, ఎదురుగా దెయ్యంలా కనపడి భయపెడుతున్న సమస్యలు సుకన్య పెళ్ళి, రాము, శీనుల చదువులు.... ఎలా జరిగి గట్టెక్కు తాయో భగవంతుడకి తలియాలి...

తానే రిటైరవడం కాకుండా, తన నుంచి లచ్చికి, రంగయ్యకి కూడా రిటైరు మెంటు దొరికింది. ఇక్కడొక్కచోట వాళ్ళ పని పోయినా బాధపడరు. మరొక పదిచోట్ల పనులు చూ—కొని జీవనం సాగించుకుంటారు. లేక ఎక్కడో అక్కడ రోజూ కూలీ తెచ్చుకొని, రేపటి మాట తలపెట్ట కుండా నిశ్చింతగా బ్రతికేస్తారు. కాని, తనో... ఇంక చేతులు ముడుచుకొని కూర్చోవలసిందే... యింక యిప్పుడు తను మరల ఉద్యోగం చెయ్యగలడా! చేస్తానన్నా ఇచ్చేవాళ్ళున్నారా! యువకులైన నిరుద్యోగులతో సమంగా తాను ఉద్యోగాల కోసం ప్రయత్నించ గలడా! ప్రయత్నించినా దొరుకుతుందా! తన మీద ఆధారపడి వున్న వీల్లందరికి ఎలా దారి చూపించ గలడుతాను! తన చేతిలో దీపముంటేనే కదా, తాను ముందు నడుస్తూ, వెనుకవారికి దారి చూపించ గలిగేది.? తానే అంధకారంలో మునిగి వుంటే, వారికి దారేం చూపగలడు!

కొత్త ప్రభుత్వం వచ్చి, జీవితంలో ఏదో వెలుగులు కుమ్మరిస్తుందని కలలు కన్నారు. ఇంట్లో తామందరూ కూడా!| కాని, వున్న వెలుగుని కూడా అంతరింపచేసి అంధకారంలోకి తోసింది... తీర్చుకోవలిసిన బాధ్యతలన్నీ ముందే వుండగా.... నడిఏటిలో నావలా అయిపోయింది సంసారం.... చివరికి, ఎప్పుడు, ఎలా, ఏతీరం చేరుతుందో భగవంతుడికి తెలియాలి....? ఆవేదనగా అనుకున్నాడు విశ్వనాథం.